# జైలు



బాబుగారు మంచానపడ్డారని కబురు తెలియగానే నా మనసంతా అదోలా అయిపోయింది. బాబుగారిని చూసి ఆరునెల్లయింది. అంతకుముందు నెలకోసారైనా బాబుగారే నన్నుచూడ్డానికి మా ఇంటికొస్తుండేవారు. 'పెద్దవారై పోయారు, మీరెందుకండి బాబుగారూ మమ్మల్ని చూడ్డానికి అంత ఎండలో నడిచొస్తారు' అని నేను నొచ్చుకుంటే, ఆయన చిన్నగా నవ్వి, "నీ మొహం, ఆడదానివి, నడిచి ఇంత దూరం నువ్వేం రాగలవ్!" అనేవారు.

"సిటిబస్సులున్నాయి కదా బాబుగారూ, నడవక్కర లేదులెండి" అంటే, "ఆ ఆ వెధవ బస్సులు టైము కొస్తాయా! ఎప్పుడు చూసినా కిక్కిరిసి ఉంటాయి... అయినా, ఇప్పుడు నాకు పనేముంది— రిటైరైన వాణ్ణి. పోనీ, మీ ఆయనెప్పుడైనా వచ్చి మీ కబురేమైనా చెబుతాడేమో నంటే ఎప్పుడూ మొహం చూపించడాయెను!" అనేవారు.

బాబుగారు నా యోగక్షేమాలు తెలుసుకోకుండా, నన్ను చూడకుండా ఉండలేరు. ఏనాటి బంధమో! కన్న తండ్రి ఎలా ఉంటాడో పుట్టాక ఎరుగను. మా అమ్మే అమ్మా, నాన్న అయి పెంచింది నన్ను తొమ్మిదేళ్లొచ్చే దాకా!

తొమ్మిదోయేటే ఈ బాబుగారింట్లో పనికి పెట్టింది నన్ను— వాళ్ల చంటిపాపని ఎత్తుకొని ఆడించడానికీ, అమ్మగారికి పై పనుల్లో సాయం చెయ్యడానికీను. నెలకి పది రూపాయలిచ్చేవారు అమ్మకి. నాకు అక్క చెల్లెళ్లా అన్నదమ్ములూ లేరు. అమ్మగారి చంటిపిల్లని ఆడించడం నాకెంతో ఇష్టంగా ఉండేది. ఆ పిల్ల ముద్దొస్తూ ఉండేది— ఎర్రగా, బొద్దుగా, రబ్బరు బొమ్మలాగ.

కానీ, అమ్మగారికి నామీద కోపం వచ్చింది— నేను పనిలో చేరాక ఆరునెలల తిరక్కుండా ఎడ పిల్లాడు— మూడేళ్లవాడు కడుపులో బల్ల పెరిగి పోయాడు. నా పాదం మంచిది కాదన్నారు. ఇంకెవరూ పనికి దొరక లేదో, ఏమో నన్ను పనిలోంచి మాత్రం తీసెయ్యలేదు. ఇంట్లో ఏ కష్టమొచ్చినా, నావల్లే వచ్చిందని నన్ను కోప్పడే వారు. కానీ బాబుగారు మాత్రం నన్ను వెనకేసుకొచ్చి అమ్మగారినే కోప్పడేవారు. పెద్ద పండగలొస్తే వాళ్ళ పిల్లలతోపాటు నాకూ కొత్తబట్టలు కుట్టించేవారు. అమ్మగారు "ఇంట్లో ఇన్ని పాత బట్టలున్నాయి పిల్లలవి, మళ్లీ కొత్తవెందుకు కుట్టించడం దానికి ఇలాగే నెత్తి నెట్టుకొని పనివాళ్లని పాడుచెయ్యడం...!" అంటూ సాధించేవారు.


బజారునుండి మిఠాయిలు, పళ్లూ తెస్తే తమ పిల్లలతోపాటు నాకూ పెట్టేవారు బాబుగారు. అమ్మగారు ఆ విషయంలో మంచావిడే పాపం. పండుగనాడు బొబ్బట్లూ, పులిహోరా చేస్తే నాకూ బోలెడు పెట్టేవారు. అయినా, బాబుగారికి నామీద ఎంతో శ్రద్ధ.

వాళ్ల పిల్లలు చదువుకుంటుంటే నేనూ చంటి పాపని జోకొడుతూ అక్కడేకూర్చునే దాన్ని. ప్రైవేటు మాస్టారు వచ్చేవేళకి నా పనులు పూర్తిచేసుకొని, పిల్లని ఒళ్లో పెట్టుకొని వాళ్లకి కాస్త దూరంలో కూర్చునే దాన్ని. బాబుగారు అదిచూసి, నన్నుకూడా చదువుకోమని పలక, బలపం ఇచ్చారు.

చంటిపాప పెద్దదవగానే నన్నుపనిలోంచి తీసేస్తారేమోనని అమ్మ భయపడింది. కానీ, అమ్మగారు మడి కట్టుకొని వంటచేస్తుంటే ఇంట్లో పైపనులు చెయ్యడానికి ఎవరూ లేరని నన్ను పనిలోంచి తీసెయ్యలేదు. పిల్లలంతా స్కూలుకీ, కాలేజీకి వెళ్లిపోతే, ఇంట్లో అన్ని పనుల్లో సాయం చేసేదాన్ని అమ్మగారికి. రాత్రిళ్లు మా ఇంటికెళిపోయి, మళ్లీ తెల్లారకుండా వచ్చేదాన్ని.

ఓసారి మా అమ్మకి ఏదో పెద్ద జ్వరం వచ్చి ఇరవై రోజులు మంచంమీదే ఉండి, చివరికి చచ్చిపోయింది. నేను గోలుగోలున ఏడుస్తుంటే, బాబుగారే నన్ను చెయ్యిపట్టుకొని వాళ్లింటికి తీసుకొచ్చారు. అప్పటినుంచి

అబ్బూరి ఛాయాదేవి




పూర్తిగా వాళ్లింట్లోనే ఉండిపోయాను. నాకు అప్ప డప్పుడు బాబుగారు చదువుకూడా చెప్పేవారు. నేను మా అమ్మ మాట్లాడినట్లు యాసగా మాట్లాడితే, అలాకాదు, ఇలా మాట్లాడాలి అని దిద్దేవారు.

నేను పెద్దమనిషినయినప్పటి నుంచీ అమ్మగారు నన్ను మరీ కష్టడీలో పెట్టేవారు. పెద్దమ్మాయి గారిలా పమిట తీరుగా సర్దుకున్నా, పిల్లలతో నవ్వుతూ మాట్లా డినా షోకులూ, విరగబాటుతనం ఎక్కువవుతున్నా యని కోప్పడేవారు. అమ్మగారూ, వాళ్ల పెద్దమ్మాయి గారూ బయటున్నప్పుడు వేరే గదిలో కూర్చునేవారు. నేను బయటుంటే విసుక్కునేవారు—"ఈ తద్దినం ఓటొచ్చి పడింది నా నెత్తిన" అంటూ.

ఓసారి మా మేనమావట— ఒకాయనొచ్చాడు. మా అమ్మ బతికుండగా చూసిన గుర్తులేదు నాకు. మా నాన్న పోయినప్పటి నుంచీ అమ్మ రెక్కల కష్టంతోనే తను బతికి, నన్ను పోషించింది. అమ్మ జబ్బులో ఉం టే, బాబుగారే డాక్టర్ని పిలిచి మందులిప్పించారు. అ మ్మ పోయినప్పుడు చుట్టుపక్కలవాళ్లూ, ఇంకా ఎవరె వరో వచ్చారు. వాళ్లకి బాబుగారే డబ్బులిచ్చారు శవాన్ని తీసుకువెళ్లడానికీ దానికీ. బాబుగారే నన్ను ఓదార్చి తమ ఇంటికి తీసికెళ్లారు. మావయ్య అప్పుడొచ్చాడట. నాకు గుర్తులేదు. మళ్లీ ఇదే రావడం. మా అత్త పోయిందిట కలరా వచ్చి. కొడుక్కి పెళ్లి చేయాలనుకుంటున్నాడట నన్ను తీసుకుపోయి తన కోడలుగా చేసుకుంటానని చెప్పాడు. అమ్మగారు వెంటనే సరేనన్నారు. కానీ బాబు గారు మావయ్య కొడుకుని చూడాలి, ఓసారి తీసుకు రమ్మన్నారు. మావయ్య రైల్వేలో కూలిపని చేస్తున్నాడు. కొడుక్కి ఏడో క్లాసుదాకా చదువు చెప్పించి, రైల్వేలో ఏదో చిన్నపని దొరికేలా చేశాడుట! మావయ్య అతన్ని తీసుకొచ్చి చూపించాక, అప్పుడు బాబుగారే మా పెళ్లి ఏర్పాట్లు చేయించారు. పెళ్లయి వెళ్లిపోతుంటే, నాకు బట్టలూ, బిందెలూ, ఇంకా బోలెడు సారె ఇచ్చి పంపిం చారు బాబుగారు.

నా సంసారం ఎలా ఉందో అప్పుడప్పుడొచ్చి కను క్కొని పోతుండేవారు బాబుగారు. వాళ్లింట్లో ఏ శుభ కార్యం వచ్చినా అమ్మగారు నాకు కబురంపేవారు— ఇంట్లో కాస్త సాయం చేసిపెట్టడానికి. మా ఆయనకీ నాకూ బట్టలు పెట్టి పంపించేవారు.

బాబుగారు మా ఇంటికొచ్చినప్పుడల్లా మా పిల్లల కోసం ఏదో ఒకటి తెచ్చిపెట్టేవారు. వాళ్ల చదువుల గురించీ, నడవడి గురించీ అన్నీ వాకబు చేసి ఏవో సలహా లిస్తుండేవారు. నన్ను తమ కన్నకూతురిలాగే చూసు కునేవారు.

బాబుగారు రిటైరయ్యాక నెలకోసారి తప్పకుండా మా ఇంటికి వచ్చి వెళ్లడం అలవాటయిపోయింది. ఒక నెలలో రాకపోతే బెంగగా అనిపిస్తుంది.

బాబుగారి పెద్దకొడుకూ వాళ్లు మద్రాసులోను, మూడో కొడుకువాళ్లూ ఢిల్లీలోను ఉంటున్నారు. ఆడ పిల్లలు కూడా తలో ఊళ్లోనూ ఉంటున్నారు. ఇప్పుడి క్కడుంటున్నది రెండో కొడుకు, కోడలూ, మనవ లూనూ. అమ్మగారు ఆరునెలలకోసారి తక్కిన కొడు కుల దగ్గరికి వెళ్లొస్తూ ఉంటారు. బాబుగారు ఎప్పుడూ ఊరువిడిచి వెళ్లరు. ఆ మధ్య ఆరునెలల క్రితం అమ్మ గారు పోరుపెడితే, ఆవిడతో కూడా ఢిల్లీకి వెళ్లారు మొ దటిసారి. అక్కడికివెళ్లాక పక్షవాతం వచ్చి కాలూ చెయ్యి పడిపోయిందిట. ఏదో కొంత వైద్యం చేయించి, ఇక్క డికి తీసుకొచ్చి వదిలిపెట్టి వెళ్లారుట ఆఖరి కొడుకూ కోడలూనూ. ఆ కోడలు ఉద్యోగం చేస్తోంది. మొగు డూ, పెళ్లాం ఇద్దరికీ కుదరదు ఇంట్లో ఉండిముసలాయ నికి చాకిరీ చెయ్యడానికి. అక్కడి భాషరాదు ముసలి వాళ్లిద్దరికీ. అక్కడ వాళ్లకి ఏవిధమైన సదుపాయం ఉండ దని చెప్పి ఇక్కడికి తీసుకొచ్చి దిగవిడిచారుట. తీసు కొచ్చి వారంరోజులైందిట. వాళ్ల చాకలి ద్వారా నాకీ కబురు తెలిసింది.

కబురు తెలియగానే బయలుదేరాను బాబు గార్ని చూడడానికి. దారి పొడుగుతా నా కళ్లల్లో నీళ్లు ఉబుకు తూనే ఉన్నాయి పమిటకొంగుతో ఎంత తుడుచుకు న్నా. సొంత తండ్రి అంటే ఎలా ఉంటాడో నాకు తెలి యదు. జ్ఞానం వచ్చినప్పటి నుంచీ అన్నిటికీ బాబుగారే కదా నాకు. ఎప్పుడూ నడుంవాల్చడం ఎరగనిబాబుగారు మంచాన పడ్డారని విన్నప్పటి నుంచీ నాకే కాలూ చెయ్యి ఆడనట్లుగా ఉంది.

దారిలో మార్కెట్టుదగ్గర బస్సుదిగిపోయి, నాలుగు బత్తాయిపళ్లు కొన్నాను. బాబుగారిల్లు మార్కెట్టుకి దగ్గ రే. సంచీపుచ్చుకొని నడుచుకుంటూ వెళ్లాను. ఎండ అంత ఎక్కువగా లేకపోయినా, బాబుగార్ని ఏ పరిస్థితిలో చూడవలసి వస్తుందోనన్న భయంతో నాకు ఒళ్లంతా చెమటలు పట్టాయి.

నేను వెళ్లేసరికి ముందుగదిలో పేము సోఫాలో పడు కొని బాబుగారి మనవడు— రెండో కొడుకు కొడుకు— ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. అమ్మగారు వం టింట్లో ఉన్నట్లున్నారు— లోపల అలికిడవుతోంది. అల వాటైన చోటే కాబట్టి ఎవరినీ అడక్కుండానే బాబు గారి గదివేపుకి వెళ్లాను. బాబుగారు కళ్లుమూసుకొని పడుకొని ఉన్నారు. రెండునిమిషాలు అలాగే గుమ్మం దగ్గర నిలబడి, వెనక్కి తిరిగాను వంటింటివైపు వెళ్లి అమ్మగార్ని కలుద్దామని.

"ఎవరది?" అన్నారు బాబుగారు. మెలుకవగానే ఉండి ఊరికే కళ్లుమూసుకొని ఉన్నట్లున్నారు.

చటుక్కున వెనక్కి తిరిగి బాబుగారి మంచం దగ్గరి కెళ్లి 'నేనే బాబుగారూ, గౌరిని' అన్నాను.

నన్నుచూసిన సంతోషం కళ్లల్లో కనిపించింది. నన్ను కూర్చోమని సంజ్ఞ చేశారు.

"అయ్యో బాబుగారూ, అనుకోకుండా ఎంత జబ్బు చేసిందండీ! నాకు నిన్న సాయంకాలమే కబురు తెలిసిం దండి. రాత్రంతా నిద్దర్లేదండి..." నా గొంతులో ఏదో అడ్డుపడ్డట్లైంది. ఇంక మాట్లడలేక మంచంపక్కనే నేలమీద చతికిలబడ్డాను. బాబుగారు కూడా ఏం మాట్లాడకుం డా మళ్లీ కళ్లుమూసుకున్నారు. బాధపడుతున్నట్లున్నా రు. ఏం మాట్లాడాలో పాలుపోక బాబుగారి కాలు ఒత్తు తూ కూర్చున్నాను.

"నువ్వెప్పుడొచ్చావే గౌరీ" అన్నారు వెనక నుంచి అమ్మగారు. చటుక్కనలేచి నిలబడ్డాను.

"ఇప్పుడే వచ్చానండమ్మా. మీరు వంటింట్లో ఉన్నా రని ఇక్కడికొచ్చానండి బాబుగార్నిచూద్దామని" అంటూ నేను తెచ్చిన బత్తాయిపళ్లని సంచిలోంచి తీసి బాబుగారి మంచం పక్కనున్న స్టూలుమీద పెట్టాను.

"కూచోండమ్మా" అని అక్కడున్న కుర్చీని అమ్మ గారివైపు జరిపి, 'ఎన్నాల్లయిందమ్మా జబ్బుచేసి?' అన్నాను.

"ఉగాది రెండురోజులుందనగా ఉప్పెనలా వచ్చిందీ మాయరోగం. కుడిచెయ్యి, కుడి కాలూ పడిపోయా యి. నోరుకూడా వంకరపోయి మాటసరిగ్గా రాలేదు కొన్నాళ్లపాటు. ఓ పదిహేనురోజుల నుంచి కొద్దికొద్దిగా మాట్లడుతున్నారు..."

బాబుగారి కేసి చూశాను. ఆయన తక్షణం మొహా న్ని గోడవైపుకి తిప్పకున్నారు ఇంక వినలేనట్లుగా.

మాటమార్చాలని, "శ్యామలమ్మ గారేరండీ?" అ న్నాను అమ్మగారితో— రెండో కోడలు కనిపించకపోతే ను.

"ఆవిడగారు అవతలుంది పొద్దున్నే..." అన్నారు

అమ్మగారు మూలుగుతున్నట్లు.

"అయ్యో పాపం, అన్ని పనులు మీమీదే పడ్డాయన్న మాటండి... ఇటు బాబుగారూ, అటు వంట.." అన్నాను సానుభూతిగా.

"తప్పుతుందా కర్మ, చేసుకున్నాక' అన్నారు నుదుటి మీద చేతివేళ్లతో కొట్టుకొని.

నా మనసు చివుక్కుమంది— ఆవిడ బాధకి కాదు, ఆవిడన్న దానికి బాబుగారు ఏమనుకుంటారోనని. అయినా ఆవిణ్ణే సముదాయించడానికి ప్రయత్నించాను. 'నాలుగు రోజులపాటు నన్నొచ్చి ఉండమంటారా అమ్మా?' అని అడిగాను. అలా వచ్చి ఉండడం సులభం కాదని తెలిసినా. నా ఇంటి బాధలు నావి.

'నాల్రోజులు నువ్వొచ్చి ఉంటే తీరే సమస్యా ఇది? ఎలా జరగాలనుంటే అలా జరుగుతుంది. ఎన్నాళ్లు అనుభవించాలో అన్నాళ్లు అనుభవించాలి... చేసుకున్న కర్మ తప్పదు' అంటున్న అమ్మగారి మాటలకి అడ్డొచ్చి, 'అలా అనకండమ్మా, ఎప్పటికీ ఇలాగే ఉండిపోతారా! బాబుగారు తొందరగానే కోలుకుంటారులెండి. బాబుగారు లాంటి వారు అలా మంచంమీద పడుకొని ఉండలేరు లెండి. నేను రోజూ ఇంట్లో పనులు తొరగా పూర్తి చేసుకొని వచ్చేసి, సాయంకాలం వరకూ ఇక్కడే ఉండి వెడుతుంటాలెండి. మీరేంబెంగెట్టుకోకండి' అన్నాను.

అంతవరకు గోడవైపుకి మొహం తిప్పుకొని పడుకున్న బాబుగారు మొహాన్ని ఇటువైపుకి తిప్పి, "నిజం గా రాగలవా" అన్నట్లు నావైపు ఆశగా చూశారు. నా కడుపు తరుక్కుపోయింది. బాబుగారి కాలిని నిమురుతూ, "పనిలో మీకు సాయంగా ఉండటానికి నే వస్తాలేండి" అన్నాను అమ్మగారితో.

బాబుగారి కిస్తున్న భోజనం గురించీ, మంచం మీద ఆయనకు జరుగుతున్న సేవల గురించీ కాసేపు అమ్మగారితో మాట్లాడాక, ఇంటికెళ్లడానికి లేచాను. తప్పకుండా రోజూ వచ్చి చూసిపోతుంటానని బాబుగారికి మళ్లీ చెప్పి బయలుదేరాను.

బస్సు తొందరగా దొరక్క ఇంటికి చేరుకునే సరికి పొద్దుగూకి పోయింది. మావయ్య కుక్కిమంచం మీద పడుకొని కునికిపాట్లు పడుతున్నాడు. పెద్దాడు ఫ్యాక్టరీ నుంచి అప్పుడే వచ్చేశాడు. ఆకలేసి, అమ్మ ఇంట్లో లేదని, ధుమ ధుమలాడుతున్నాడు. రెండోవాడు స్కూలు నుంచొచ్చి వీధిలో క్రికెట్ ఆడుతున్నాడు. వాడికి స్కూలూ, ఇల్లూకన్నా బ్యాటూ, బంతీ ముఖ్యం. గబగబా కుంపటి రాజేసి టీ కలిపిచ్చేను పెద్దాడికి. మామయ్య ముక్కేసుకొని పడుకున్నట్లున్నాడు. ఎన్నిసార్లు పిలిచినా లేవలేదు. మావయ్య కింకో పనిలేదు. ఇంట్లో ఉంటాడన్న మాటేగానీ మనిషి సాయంలేదు. ఇంట్లో దొంగలుపడ్డా, కొంపంటుకొని కాలిపోతున్నా ఓ పట్టాన మత్తువదల్దు. ఎక్కడ సంపాయించి తెచ్చుకుంటాడో తెలియదు. ఆయనతో చెప్పి లాభంలేదు. ఆ తండ్రికి తగ్గ కొడుకు. తండ్రికీ, కొడుక్కీ సీసా ఖాళీ అయితే గానీ మనసు నిలవదు. మావయ్య ఎవరికీ కనిపించకుండా సీసాని ఏ మూలో దాచుకొని మధ్య మధ్య ఓ చుక్క నోట్లో పోసుకుంటూ ఉంటాడు. ఏ నాసిరకమైనా సరే, చుక్కుంటే చాలు. పగలూ రాత్రి భేదం లేదు. ఇక ఆయన సరేసరి. రైల్వే డ్యూటీ కాగానే తిన్నగా ఇంటికి ఏనాడూ రాడు. వాళ్లనీ వీళ్లనీ పోగేసుకొని పూటుగాపట్టించి కాళ్లీడ్చుకుంటూ ఇంటికొస్తాడు. ఆ సమయంలో ఏం మాట్లాడినా బెడిసి కొడుతుంది. నీతులు చెప్పినా నాదన పెట్టుకున్నా తిండి తినకుండా పస్తుంటాడు. నా గతీ అంతే అవుతుంది. నా బాధంతా నా కోసం కాదు. కుర్రాళ్ళిద్దరూ చెడిపోతారేమోనని.

పెద్దాడు చదువుకున్నన్నాళ్లా బాగానే ఉన్నాడు చేతిలో చిల్లర డబ్బులులేక. ఇప్పుడు నాలుగురాళ్లు సంపాయించడం మొదలు పెట్టాక మారిపోయాడు. పెద్ద పిల్ల పెళ్లికి చేసిన అప్పులు తీరతాయేమోనని ఆశ పెట్టుకోవడం దురాశే అవుతోంది. జీతం డబ్బుల గురించి అడగడం భయం, తండ్రితో తగువు పెట్టుకుంటాడు. నయానా భయానా నేనడిగి తీసుకోవడం లేదని నన్నే సతాయిస్తాడాయన. ఇద్దరి మధ్య నేను చస్తున్నాను. గట్టిగా నిలదీస్తే ఇంట్లోంచి వెళిపోతానని బెదిరించాడొక రోజున. వీడిప్పుడే ఇలా ఉంటే, రేప్పొద్దున పెళ్లయాక నా మొహం చూస్తాడా?

ఇక రెండో వాడెలా తయారవుతాడో! కాలేజీలో చేర్పించి పెద్ద చదువు చదివించాలనీ, ఆఫీసరవాలనీ నా ఆశ. వాడు బ్యాటూ బంతీ వొదల్డు. ఆ క్రికెట్ పిచ్చి పట్టుకుంది. అది కూడెట్టనా గుడ్డెట్టనా? ఇటు నాయన పట్టించుకోడు, అటు అన్న పట్టించుకోడు. పైగా పిల్ల పెళ్ళికయిన అప్పలొకటి. మంచాన్ని పట్టుకుని మత్తుగా పడుకునే మావయ్యొకడు. ఎలా ఈ సంసారం ఈదడం? ధరలు చూస్తే ఆకాశాన్ని అంటుకుపోతున్నాయి. ఆకాశం కూడా అంతకంతకు పైకి పోతున్నట్లుంది. నా మటుకు నాకు భూమిలోకి దిగబడి పోతున్నట్లుగా ఉంటోంది. సీతమ్మ వారిలా లోనంటూపోయి మాయమైపోయినా బావుండును. సీతమ్మ వారెక్కడ, నేనెక్కడ!

నాకు చదువులేదు, సుఖంలేదు. నా కూతరయినా చదువుకోవాలి అనుకుంటే,' దానికి షోకులూ, సినిమాలూ తప్ప పుస్తకం మీద ధ్యాస ఉండేది కాదు. ఎదురింటి మేడ వాళ్ళింట్లో టి.వి. చూస్తూ కూచునేది. ఇక లాభం లేదని, అంతకు తగ్గ బొంత అన్నట్లు ఏదో సంబంధం చూసి, పెళ్ళి చేసి పంపించాం. అప్పు మిగిలింది.

రాత్రి తొమ్మిదవుతూండగావచ్చాడాయన.వస్తూనే, నిద్రపోతున్న పెద్దాణ్ణి లేపి మరీ కజ్జాకి కాలు దువ్వాడు. సద్దుమణిగే సరికి నిప్రాణొచ్చింది.

ఆయనలో ఒక్కటే సుగుణం. రాత్రి మాటలూ, చేష్టలూ ఎంత దురుసుగా ఉన్నా, పొద్దున్న పెద్దమనిషిలాగా ఏమీ ఎరగనట్టుంటాడు. ఏదన్నా చెప్పినా ఊకొడతాడు. సాయంకాలం అయిందంటే ఇంక ఇంటికీ ఆయనకీ చుక్కెదురు. ఏం చెప్పినా పొద్దున్నే చెప్పాలి. ఆయన చేసినా చెయ్యకపోయినా.

పొద్దున్న భోంచేసి పనిమీద వెళ్ళేముందు చెప్పాను బాబుగారి పరిస్థితి గురించీ, నేను నాలుగు రోజుల పాటు వెళ్ళి పగలంతా అమ్మగారికి సాయంగా ఉండాలనుకుంటున్న సంగతీనూ.

"ఇంట్లో అయ్య సంగతేం జేస్తావ్" అన్నాడు.

"బజారు పన్లకీ వాటికీ మావయ్యని ఇంట్లో వదిలేసి వెళ్ళడం లేదా! అలాగే ఇంకొంచెం సేపవుతుంది, అంతే. మావయ్యకి కావాల్సినవన్నీదగ్గరపెట్టేవెడతాను. మళ్ళీ కుర్రాళ్ళొచ్చేవేళకి వచ్చేస్తాను" అని నచ్చచెప్పాను.

"సరే, నీ ఇష్టం" అనేసి పన్లోకి వెళ్ళిపోయాడు. కుర్రాళ్ళిద్దరికీ కూడా చెప్పాను పగలు నేను ఇంట్లో ఉండనన్న సంగతి. నేను సాయంకాలం తిరిగి రావడం కాస్త ఆలస్యమయినా, ఇల్లు చూసుకోమనీ, తాతమీద వదిలెయ్యవద్దనీ చెప్పాను.

పెద్దాడు 'నువ్వేమన్నా వాళ్ళ నౌకరువా..." అంటూ ఎగిరాడు.

"నీకేం తెలుసురా, నేను బాబుగారికీ, అమ్మగారికీ ఎంత రుణపడి ఉన్నానో. వాళ్ళ కోసం ఆ మాత్రం కూడా చెయ్యకపోతే ఇక ఎందుకు నేను బతికీ.."

"ఏమో, అదంతా నాకు తెలవదు. సాయంకాలం నేనొచ్చేసరికి ఇంట్లో ఉండు. నేను టీ తాగి మళ్ళీ వేరే పనిమీదెళ్ళాలి" అన్నాడు.

చిన్నాడికెప్పుడూ క్రికెట్‌మీదే ధ్యాస. పుస్తకం

య యీర్ష్యః పరవిత్తేషు
రూపే వీర్యే కులాన్వయే
సుఖ సౌభాగ్య సత్కారే
తస్యవ్యధి రనంతకేః!

ఇతరుల ధనానికి, పరాక్రమానికి, అభిజాత్యానికి సుఖ సౌభాగ్య సత్కారాలకు అసూయపడేవారు, నయంగాని దీర్ఘరోగంతో కుమిలిపోవలసిందే!

(ఈ మాటలు విదురుడు దుర్యోధనుని ఈర్ష్య గురించి ధృతరాష్ట్రునితో ప్రస్తావించిన సందర్భంలో అన్నవి)

ముట్టుకుంటే ఒట్టు. వీధే వాడి ఇల్లూ వాకిలీ. బ్యాటూ, బంతీ ఉంటే భోజనం కూడా అక్కర్లేదు వాడికి.

ఎవరికీ ఏ విధంగానూ లోపం రాకుండా, నేను ఇల్లు కదలకుండా ఇంట్లో కట్టిపడేసినట్లుండాలి అంటే నాకూ బాధనిపిస్తుంది అప్పుడప్పుడు. ఎంతకని వాళ్ళ చుట్టూ బొంగరంలా తిరగడం? ఓ తల్లీ తోడూ లేరు— ఎప్పుడైనా పుట్టింటికెడదామంటే. ఉన్నా వెళ్ళ నిస్తారా వీళ్ళు? రెక్కలు విరిచిన పక్షిలా పడుంటమే.

లోలోపల విసుక్కుంటూనే ఇంట్లో పనులన్నీ పూర్తి చేసుకొని, మావయ్యకి చెప్పాల్సిన అప్పగింతలు చెప్పి, బస్సులో పడేసరికి పది దాటింది ఎంత తొందరగా తెములుద్దామన్నా.

నేను వెళ్ళేసరికి అమ్మగారికింకా వంటింట్లో పని తెమల్లేదు. అయ్యగారి గదివైపుకి వెళ్ళాను. లోపల్నించి అయ్యగారు నీరసంగా ఎవరినో పిలుస్తూన్నట్లనిపించింది. గబగబా లోపలికెళ్ళాను.

"దాహం... మంచినీళ్ళు" అన్నారు. మంచం పక్కనే ఎడంచేతివైపు బాబుగారికి అందేలాగా చిన్న బల్లమీద గ్లాసూ, మరచెంబూ ఉన్నాయి. కానీ గ్లాసులో నీళ్ళయిపోయాయి. మరచెంబులోంచి వంచుకోవడం సాధ్యంకాక దాహంతో బాధపడుతున్నారు. గబగబా గ్లాసులోకి నీళ్ళు వంచి, బాబుగారి నోటి కందించాను. మెల్లిమెల్లిగా గుటకలు వేశారు. గ్లాసు బల్లమీద పెట్టేసి, మంచం పక్కన నేలమీద కూర్చున్నాను.

"బాబుగారూ, ఎలా ఉందండీ ఒంట్లో?" అన్నాను

పోయింది... మంచి నీళ్ళిచ్చే దిక్కులేదు..." అన్నారు కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ.

"ఛ, అలా అనుకుని బాధపడకండి. అమ్మగారు వంటింట్లో ఉన్నారు. పాపం పని తీరు లేదులావుంది. అబ్బాయిగారు ఆఫీసుకీ, పిల్లలు కాలేజీకి వెళ్ళుంటారు. కోడలు గారు స్నానం చేసి ఇంట్లో కొస్తే, అమ్మగారికి మీ సంగతి చూసుకోవడానికి వీలవుతుంది లెండి" అన్నారు సముదాయిస్తూ.

"ఏంకాదు... అందరికీ నేనంటే విసుగు, కోపం నా మొహం చూస్తే చిరాకు... నాతోమాట్లాడరుఎవరూ" అన్నారు చంటిపిల్లాడిలా కళ్ళనీళ్ళు కారుస్తూ.

నేను బాబుగారి చెయ్యి నిమురుతూ, "అదేంటి బాబుగారూ, అలా అనుకోకండి. మీకింత జబ్బుచేసి మంచాన పడి ఉంటే మీమీద ఎలాంటి వాళ్ళకయినా కోపం ఎలా వస్తుదండీ? ఎవరి పనుల్లో వాళ్ళుండి, మీ దగ్గర చాలా సేపు కూర్చోవాలంటే కుదరటంలేదేమో నండి. మీరలా మనసు పాడు చేసుకోకండి" అని బుజ్జగించాను.

"నీకు తెలీదు గౌరీ, నేనంటే అసహ్యం అందరికీ. అన్నిటికీ అందరి మీదా ఆధారపడుతున్నాను. లేచి తిరగ లేను. ఏ పనీ చెయ్యలేను. రాత్రీ, పగలూ ఈ గదిలోనే పడుంటున్నాను. జైల్లో ఉన్నట్టుంది" అన్నారు చుట్టూ గోడలవైపు చూస్తూ.

ఏం చెప్పి సముదాయించాలో అర్థంకాలేదు. 'జైలు' అన్నమాట చెళ్ళుమన్నట్లు తగిలింది నా బుర్రకి. నా ఇల్లు నా కళ్ళముందు మెదిలింది. క్రమంగా నా చుట్టూ దట్టంగా బిగుసుకుంటూ నన్ను కదలనివ్వకుండా చేసి, నాకు ఊపిరి సలపనివ్వనట్లనిపించింది క్షణం సేపు. నా చెయ్యి బాబుగారి చేతిని నిమురుతూ బిగ పట్టినట్లుంది. బాబుగారు చేతిని విదిలిస్తూ 'గౌరి' అన్నారు గట్టిగా. నాకు తెలివొచ్చింది.

"బాబుగారూ..." అన్నాను మళ్ళీ చేతిని మృదువుగా నిమురుతూ— ఆయన కళ్ళలోంచి మళ్ళీ నీటి చుక్కలు చెవుల పక్కనుంచి పక్కమీదికి జారిపడ్డాయి. ఆయన ఎడం చెయ్యి నా చేతిలో ఉంది. కుడి చెయ్యి పడిపోయింది కదా, లేవలేదు. తెలివి తెచ్చుకుని బాబుగారి కళ్ళు తుడిచాను.

"బాబుగారూ, బాధపడకండి, నేను మీకు చెప్పగలిగేటంతటి దాన్ని కాదని మీకు తెలుసండి. కానీ, నా అనుభవం మీద చెబుతున్నానండి. మీరు ఇందాక 'జైల్లో ఉన్నట్లుంది" అన్నారండి. ఈ గదిలో మంచం మీద కట్టిపడేసినట్లు కదల్లేకుండా ఉన్నారు కనుక మీ కలా అనిపిస్తోందండి. కానీ, బాబుగారూ, నా కయితే, ఈ లోకమే పెద్ద జైలనిపిస్తోందండి... మనం కావాలని వచ్చామేంటండి ఇక్కడికి? మనం వెనక జన్మలో చేసుకున్న కర్మకొద్దీ ఎవరి కుడుపునో పుడతాం కదండీ. మనం కావాలనుకున్న చోట పుట్టలేం కదండీ. కావాలనుకున్నవన్నీ చెయ్యలేం కదండీ. చదువు, సంధ్య, పెళ్ళి, పిల్లలూ— ఏవీ మన చేతుల్లో లేవుకదండీ, పరిస్థితులెలా ఉంటే వాటి ప్రకారం నడుచుకోవాలి కదండీ. ప్రతి వాళ్ళూ ఉన్న పరిస్థితుల్లోంచి తప్పించుకోవాలని గిలగిల్లాడుతారు కదండీ. బయట పడాలంటే మన చేతుల్లో ఏముందండీ?... ఈ సంసారం, సంఘం, అంతా ఓ జైలు కాదంటండీ? ఒక్కోసారి విసుగొచ్చి చావాలన్నా కుదరదు కదండీ.. అందుకే నాకీ లోకమే పెద్ద జైలనిపిస్తోందండి. పుట్టి ఇందులో పడ్డాక, ఇక్కణ్ణించి పారిపోలేం కదండీ. మన శిక్ష పూర్తి అయిందనుకుంటే ఆ దేవుడే— మనల్నిక్కడ బంధించిన వాడే విడిపించాలండి.. అంతేకదండి బాబుగారూ?

బాబుగారు చిన్నగా నవ్వారు నా మాటలకి. ఇప్పుడు బాబుగారి కళ్ళల్లో నీళ్ళు లేవు. నాకు ధైర్యం వచ్చింది బాబుగార్ని నా మాటలు బాధ పెట్టలేదని.

"ఎప్పుడొచ్చావే గౌరీ?" అంటూ వచ్చారు అమ్మగారు.

నేను లేచి నిలబడి, "ఎంతో సేపు కాలేదండి. శ్యామలమ్మగారు ముందుగదిలో ఉన్నారండి. తలుపు తీసే ఉందండి. మీరు వంటింట్లో ఉన్నారని, ఇక్కడ కొచ్చి కూర్చున్నానండి.. పనేమన్నా ఉందాండీ నేను చెయ్యడానికి?" అన్నాను.

"నాకేం చెయ్యాలే! చెయ్యాల్సిందంతా మీ బాబుగారికే. ఆ మలమూత్రాల పనులవీ నువ్వేం చేస్తావ్! కట్టుకున్నందుకు నాకు తప్పదుగా. అటు వంటా తప్పదు, ఇటు ఇదీ తప్పదు. ఏ జన్మలో చేసుకున్న కర్మో" అంటూ ఎదురుగా ఉన్న మంచం మీద చతికిలపడ్డారు.

నేనేదో తప్పు చేసినట్లు కుంచించుకుపోతూ చూశాను బాబుగారికేసి. కానీ బాబుగారు ఇదివరకులా బాధపడి మొహం అటువైపుకి తిప్పుకోలేదు, కళ్ళనీళ్ళు పెట్టుకోనూ లేదు. భార్యవైపు జాలిగా చూస్తూ, చిన్నగా నవ్వుతున్నాయి ఆయన కళ్ళు.


నా గుండెమీద బరువేదో తీసేసినట్లనిపించింది... నా కొక్కర్తెకే ఈ లోకంలో మోయలేనన్నిబాధ్యతలూ, బాధలూ ఉన్నాయనుకుంటే గుండె బరువెక్కుతుంది. నన్ను ఈ సంసారమనే ఇరుకు జైల్లో పడి ఉండమని ఎవరో శిక్ష వేసినట్లనిపిస్తుంది.

ఇంకో మనిషి కూడా అలా బాధతో గిలగిల్లాడుతున్నాడని తెలిశాక మనకున్న బాధ అంతగా లెక్కలోకి రాదేమో. నిజానికి బాబుగారి బాధ ముందు నేను ఇంట్లో పడుతున్నాననుకునే బాధెంత... అమ్మగారి మాటలు విన్నాక బాబుగారికి కూడా అలాగే అనిపించిందేమో. అందుకే ఆవిడ కేసి జాలిగా చూసి చిన్నగా నవ్వగలిగారేమో.

ఒంటరిగా బాధపడుతూంటే లోకమే జైలు లాగా అనిపిస్తుంది. ఇతరుల బాధను అర్థం చేసుకుంటే లోకమెంత విశాలమైనదో తెలుస్తుందనుకుంటాను. ఈ అనుకోవడం, అనిపించడం— అంతా మనసుకే కదా. నిజానికి, ఈ గది, ఈ ఇల్లు, ఈ సంసారం ఏదీ జైలు కాదుగా!

బాబుగారికి పళ్ళరసం తీసిచ్చాక, అమ్మగారూ, నేనూ అందరి ముచ్చట్లూ చెప్పుకున్నాం. బాబుగారు వింటూ పడుకున్నారు.

సాయంకాలం పెద్దాడు ఫ్యాక్టరీ నుంచి ఇంటికొచ్చే లోపునే నేనూ ఇంటికి చేరుకోవాలని అమ్మగారి దగ్గరా, బాబుగారి దగ్గరా సెలవు తీసుకుని బయలు దేరాను. మనసంతా తేలిగ్గా ఉన్నట్లుంది. ఇంటి ఖర్చుకోసం పైసా ఇవ్వని పెద్దాడు, పుస్తకం చేత పట్టని చిన్నాడూ, ఇంటి గురించి పట్టించుకోని ఆయన, మంచం వదలని మావయ్య— ఎవర్ని తలుచుకున్నా ఎందుకో జాలి, ఏదో మమకారం ఉప్పొంగి ఎప్పుడింటికెడతానాఅనిపించింది. ●



"నేను వివిధ పత్రికలకు వంద కథలు దాకా పంపాను. కాని ఒక్కటికూడా అచ్చుకు నోచుకోలేదు. మీరేదైనా చర్య తీసుకోగలరా?" యస్.ఐగార్ని అడిగింది రేణుక.

"మా లాకప్‌లో చచ్చి పడున్న ఆ గంగులుది ఆత్మహత్యేనని నేనుస్వయంగా చూశానని ఒక కథ రాయి"

"అచ్చవుతుందంటారా"

" తప్పకుండా రేపు పేపర్లోనే"